AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే



**అక్షరటుడే, ఆర్మూర్:** ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి బుధవారం ఉదయం తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కలియుగ దైవం వెంకటేశ్వరుని ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై, ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలు, నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు చెప్పారు.


24-6-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## ఇందూరు ఊర పండుగ.. ఏర్పాట్లపై ఎమ్మెల్యే ధన్‌పాల్ పరిశీలన



**అక్షరటుడే, ఇందూరు :** ఆషాఢ మాసంలో ఇందూరు నగరంలో ఎంతో ఘనంగా జరిగే 'ఊర పండుగ' కోసం ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయి. నగరంలోని ఖిల్లా ప్రాంగణంలో ఉన్న అమ్మవార్ల గద్దెలను భక్తుల సౌకర్యార్థం మరింత మెరుగుపరుస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ప్రకటించారు. బుధవారం ఆయన సర్వ సమాజ్ కమిటీ సభ్యులతో కలిసి క్షేత్రస్థాయిలో గద్దెలను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, భక్తులు ఎక్కడి నుంచి చూసినా అమ్మవార్లు స్పష్టంగా కనిపించేలా గద్దెల ఎత్తును పెంచుతున్నామని తెలిపారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని గద్దెల వద్ద అదనపు నిర్మాణాలను చేపట్టనున్నట్లు, తద్వారా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. పనులను వేగంగా పూర్తి చేసి, ఊర పండుగ నాటికి ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. అలాగే గద్దెల చుట్టూ ఉన్న స్థలాన్ని చదును చేసి, భక్తులకు అనుకూలంగా మార్చాలని అధికారులను ఆదేశించారు. ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలోని మూడో ఆదివారం ఊర పండుగ నిర్వహించడం ఆనవాయితీ అని కమిటీ ప్రతినిధులు తెలిపారు. అయితే, ఈసారి అదే రోజున సంకటహర చతుర్థి రావడంతో పండుగ నిర్వహణపై తగిన నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. రాజేశ్వర్, రామర్తి గంగాధర్, కార్పొరేటర్లు మల్కాయ్ మహేందర్, నాగోల్ల లక్ష్మీనారాయణ, బంటు ప్రీతి ప్రవీణ్, జ్యోతి మురళి, అర్చనా చిరంజీవి పాల్గొన్నారు.



## 27న ఇందూరుకు మంత్రి సీతక్క రాక..

**అక్షరటుడే, ఇందూరు:** పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఈ నెల 27న జిల్లాకు రానున్నారు. ఈ మేరకు నిజామాబాద్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్పగంగారెడ్డి వివరాలు వెల్లడించారు. నగరంలోని మార్కెట్ యార్డ్‌లో ఛైర్మన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముప్ప గంగారెడ్డి మాట్లాడుతూ.. శ్రద్ధానంద్ గంజ్, గాంధీగంజ్‌లలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం నిమిత్తం ఈనెల 27న జిల్లాకు మంత్రి సీతక్క రానున్నారని చెప్పారు. ఈ సందర్భంగా నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో కొత్తగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించి, తగు ప్రతిపాదనలను వ్యవసాయ మార్కెటింగ్ శాఖకు పంపేందుకు తీర్మానించామన్నారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ జంగిటి రాంచందర్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



ఏడాది క్రితం కురిసిన కుండపోత వర్షా లకు కామారెడ్డి పట్టణం చివురుటాకులా వణికిపోయింది. జీఆర్ కాలనీ, కౌండిన్య కాలనీ సహా అనేక లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. మోకాళ్ల లోతు నీళ్లు ఇళ్లలోకి చేరడంతో వందలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. నిత్యావసరాలు, విద్యుత్ లేక ప్రజలు పడ్డ అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఆ చేదు జ్ఞాపకాల నేపథ్యంలో ప్రస్తుతం మున్సిపల్ పాలకవర్గం అప్రమత్తం అయింది. వర్షా కాలం ప్రారంభం కావడంతో వరదల నియంత్రణకు చర్యలు ప్రారంభించింది.

- అక్షరటుడే, కామారెడ్డి

# వరదల నియంత్రణకు చర్యలు

- కామారెడ్డిలో ముంపు ప్రాంతాల గుర్తింపు
- డ్రైనేజీలు, కాలువల్లో పూడికతీత
- పనులు ప్రారంభించిన మున్సిపల్ ఛైర్‌పర్సన్

కామారెడ్డి పట్టణంలోని డ్రైయినేజీలు, కాలువలు పూడికతో నిండిపోయాయి. వరద కాలువల్లో పిచ్చి మొక్కలు పెరిగాయి. చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో వర్షాలు వస్తే వరద నీరు సాఫీగా వెళ్లే మార్గం లేక రోడ్లపైకి వస్తోంది. దీంతో దాంతో మున్సిపల్ అధికారులు పూడిక తీత పనులు ప్రారంభించారు. కాలువలన్ని శుభ్రం చేస్తున్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, కమిషనర్ ఆదేశాల మేరకు అధికారులు, సిబ్బంది పట్టణమంతా క్షేత్రస్థాయిలో పర్యటించారు. 'ఈసారి ఒక్క కాలనీ కూడా మునగడానికి వీల్లేదు, ఒక్క కుటుంబం కూడా ఇబ్బంది పడకూడదు' అనే స్పష్టమైన లక్ష్యంతో వరద ముప్పు ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా పరిశీలించి, వాటికి తక్షణ పరిష్కారం చూపేలా ప్రణాళిక రూపొందించారు.

### హై అలెర్ట్ జోన్లుగా..

వరదలతో గత ఏడాది తీవ్రంగా నష్టపోయిన జీఆర్ కాలనీ, కౌండిన్య కాలనీలతో పాటు గాంధీనగర్, బతుకమ్మ కుంట, ఎన్జీవోస్ కాలనీ, విద్యానగర్, వినాయక్ నగర్‌లను 'హై అలర్ట్' జోన్లుగా మున్సిపాలిటీ గుర్తించింది. ముఖ్యంగా జీఆర్ కాలనీ నుంచి వెళ్లే ప్రధాన వరద కాలువ చెట్లు, పొదలతో పూర్తిగా మూసుకుపోయి ఉండటమే గత ఏడాది వరదలకు ప్రధాన కారణమని తేలింది. చెరువు నుంచి వచ్చే నీరు పారే మార్గం లేక కాలనీలన్నీ మునిగిపోయాయి. ఈసారి అలాంటి పరిస్థితి రాకుండా ముందస్తుగానే ఆయా పాయింట్లపై ప్రత్యేక దృష్టి సారించారు.

### పనులు ప్రారంభం

సమస్యాత్మక ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన పనులు మొదలుపెట్టారు. జీఆర్ కాలనీ వరద కాలువను జేసీబీల సాయంతో పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తున్నారు. కాలువ వెంబడి ఉన్న పొదలు, చెత్త, మట్టిని పూర్తిగా తొలగిస్తున్నారు. గాంధీనగర్, బతుకమ్మ కుంట, ఎన్జీవోస్ కాలనీ, విద్యానగర్‌లలో డ్రైనేజీ లైన్లలో పేరుకుపోయిన పూడికను సిబ్బందితో తీయిస్తున్నారు. అవసరమైన చోట్ల జేసీబీలు, టిప్పర్లను వినియోగించి పనులు వేగవంతం చేశారు. 'గతేడాది రాత్రికి రాత్రే ఇళ్లలోకి నీళ్లు వచ్చాయి. ఈసారి ముందే పనులు మొదలు పెట్టడంతో కాస్త ధైర్యంగా ఉంది' అని కౌండిన్య కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### శాశ్వత పరిష్కారం దిశగా

తాత్కాలిక పూడికతీతతోనే ఆగకుండా, భవిష్యత్తులో వరద ముప్పు పూర్తిగా తొలగించేందుకు మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తోంది. వరద నీటి నిర్వహణ కోసం ప్రత్యేక ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించింది. స్ట్రామ్ వాటర్ డ్రైన్ల నిర్మాణం వంటి పనులకు ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసింది. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి. స్ట్రాం వాటర్ డ్రెయిన్ల నిర్మాణం పూర్తయితే సగం వరకు సమస్య పరిష్కారం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

### ముందస్తు చర్యలు



గత ఏడాది కామారెడ్డి పట్టణంలో వరదలు ముంచెత్తాయి. ముఖ్యంగా జీఆర్, కౌండిన్య కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అందుకే ఆ కాలనీలు మరోసారి వరద బారిన పడకుండా వరద కాలువ పూడిక తీత పనులు రూ.2 లక్షల వ్యయంతో యుద్ధప్రాతిపదికన మొదలుపెట్టాం. ప్రతి వార్డులో డ్రైనేజీలను సిబ్బందితో శుభ్రం చేయిస్తున్నాం. విలీన గ్రామాల్లో పిల్ల కాలువలను కూడా శుభ్రం చేయిస్తున్నాం. అవసరమైన చోట జేసీబీలను ఉపయోగిస్తున్నాం. ప్రజలు కూడా కాలువల్లో చెత్త వేయకుండా సహకరిస్తే కామారెడ్డిని వరద రహిత పట్టణంగా తీర్చిదిద్దుకోవచ్చు. – **ఇప్ప ఉమారాణి, మున్సిపల్ ఛైర్‌పర్సన్**



## తెలంగాణ యూనివర్సిటీలో పరీక్షల షెడ్యూల్ విడుదల

**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** తెలంగాణ యూనివర్సిటీలో వివిధ విభాగాలకు సంబంధించి పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు కంట్రోలర్ సంపత్ కుమార్ బుధవారం ప్రకటన విడుదల చేశారు. యూనివర్సిటీ పరిధిలో బీఈడీ, బీపీఈడీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు ఈనెల 29 నుంచి ప్రారంభం కానున్నాయి. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్ సైట్‌ను సందర్శించాలన్నారు. యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో 2016 నుంచి 2020 బ్యాచ్‌ల విద్యార్థులకు వన్ టైం ఛాన్స్ బ్యాక్‌లాగ్ పరీక్షలు వచ్చేనెల 4 నుంచి జరుగనున్నాయి. ఈ పరీక్షలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలంగాణ యూనివర్సిటీ వెబ్ సైట్‌లో పొందుపర్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆయా తేదీలకనుగుణంగా పరీక్షలకు హాజరు కావాలని సూచించారు.




## కన్కల్ సర్కారు బడి ఆదర్శం..: డీఈవో

**అక్షరటుడే, తాడ్వాయి:** కన్కల్ ప్రభుత్వ పాఠశాలను మిగితా గ్రామాలు ఆదర్శంగా తీసుకోవాలని కామారెడ్డి డీఈవో మల్లికార్జున్ పిలుపునిచ్చారు. బుధవారం తాడ్వాయి మండలం కన్కల్‌లో పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తుల చొరవతో 145 మంది విద్యార్థులు ప్రైవేట్ స్కూళ్లకు గుడ్‌బై చెప్పి సర్కారు బడిలో చేరడం గర్వకారణమన్నారు. సర్పంచ్ రవీందర్ రెడ్డి నేతృత్వంలో 15 మందితో కమిటీ ఏర్పాటు చేసి పాఠశాల నిర్వహణ చేపట్టారని, అన్ని వసతులూ కల్పిస్తున్నారని తెలిపారు పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవడం తల్లిదండ్రుల బాధ్యత అన్నారు. ఎంఈవో రామస్వామి, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అధికంగా తరుగు తీసిన రైస్‌మిల్లులపై చర్యలు తీసుకోవాలి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లాలో అధికంగా తరుగు తీసిన రైస్‌మిల్లులపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో వరి ధాన్యం కొనుగోళ్లు కలెక్టర్ చొరవతో మొదటి స్థానంలో నిలిపినందుకు కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు. అయితే ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైస్‌మిల్ యజమానులతో కలిసి రైతులను మోసం చేశారన్నారు. రైస్‌మిల్ యజమానులు, కొనుగోలు కేంద్రాలు ఐకేపీ సహకార సంఘాల కలిసి రైస్‌మిల్ యజమానులతో అవగాహన కుదుర్చుకుని క్వింటాలుకు పది కిలోలు అదనపు తరుగు తీసుకొని రైతులను నిండా ముంచారన్నారు. జిల్లాలో సుమారుగా 8.26 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందని అందులో 8.26 లక్షల క్వింటాళ్ల ధాన్యం తరుగు తీసుకున్నారని ఆరోపించారు.. ఐకేపీ అమీర్‌నగర్ కొనుగోలు సెంటర్ పరిధిలో నాగపూర్ గ్రామ రైతుల వద్ద 40 కిలోల సంచికి రూ.27 హమాలీ వసూలు చేశారన్నారు. ఈ కేంద్రంలో సంచులు ఎక్కువైతే హమాలీ ఛార్జీలు ఎక్కువ వస్తాయని 38 కిలోల 600 గ్రాములు తూకం వేశారని పేర్కొన్నారు. వీటిపై విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని ఆయన కలెక్టర్‌ను కోరారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు: మల్లికార్జున్





**అక్షరటుడే, కామారెడ్డి:** విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడొద్దని, నీట్ పేపర్ లీకేజీపై కారణమైన వారిని కేంద్రం కఠిన చర్యలు తీసుకోవాలని డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజ్‌కు నిరసనగా, బాధిత విద్యార్థులకు సంఘీభావంగా కామారెడ్డిలో బుధవారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించింది. రాహుల్ గాంధీ చేపట్టిన ఛాత్రోన్ కీ గూంజ్ కార్యక్రమానికి మద్దతుగా డీసీసీ అధ్యక్షుడి నాయకత్వంలో ఈ ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, గ్రంథాలయ ఛైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ సెల్ నేతలు, కాంగ్రెస్ శ్రేణులు, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని నివాళులర్పించారు.

## ఎమ్మెల్యే కేవీఆర్‌కు న్యాయస్థానంలో ఊరట..

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి ఎమ్మెల్యేకు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు నుంచి భారీ ఉపశమనం లభించింది. పట్టణంలో ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్‌కు వ్యతిరేకంగా నమోదైన కేసులను కోర్టు కొట్టివేసింది. 2023లో జరిగిన ప్రజా ఆందోళనల్లో పాల్గొన్నందుకు కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డిపై కామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో మూడు కేసులు నమోదయ్యాయి. ఈ కేసులను హైదరాబాద్ నాంపల్లిలోని ప్రజా ప్రతినిధుల ప్రత్యేక కోర్టు కొట్టివేసింది. ప్రజల ఆస్తులు, రైతుల భూములు, పట్టణ వాసుల హక్కుల పరిరక్షణ కోసం జరిగిన ధర్నాలు, బతుకమ్మ కార్యక్రమాలు, వంటావార్పు, ర్యాలీలు వంటి ప్రజాస్వామ్య నిరసనల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రజలకు మద్దతు తెలిపారు. ఈ కేసులను సమగ్రంగా పరిశీలించిన కోర్టు, అభియోగాలను కొనసాగించేందుకు తగిన ఆధారాలు లేవని నిర్ధారించి కొట్టివేసినట్లు న్యాయవాదులు తెలిపారు. ఎమ్మెల్యే తరపున వాదించిన అడ్వకేట్లు ఎల్. ప్రభాకర్ రెడ్డి, వై. రాములు, టి. ఉదయ్ రాజ్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా చేసిన ఆందోళనలను నేరంగా పరిగణించలేమని, న్యాయస్థానం వాస్తవాలను పరిశీలించి న్యాయం చేసిందని పేర్కొన్నారు.



## డ్రగ్స్ రహిత నిజామాబాద్ కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలి..: సీపీ





**అక్షరటుడే, బోధన్:** విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని.. డ్రగ్స్ రహిత నిజామాబాద్‌కు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీ సాయిచైతన్య అన్నారు. పట్టణంలోని ఇందూరు మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ.. యువత సన్మార్గంలో నడిచినప్పుడే దేశ భవిష్యత్తు బాగుంటుందన్నారు. జూన్ 22 నుండి జూన్ 26 వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా.. విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 26న నిర్వహించనున్న అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాలు జరుపుతున్నట్లు సీపీ తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తుల జీవితాలను మాత్రమే కాకుండా దేశభవిష్యత్తును సైతం దెబ్బతీస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రణ కోసం దాదాపు రూ.400 కోట్లు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు అప్రమత్తంగా ఉండాలని సీపీ సూచించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. డయల్ ఈగల్ ఫోర్స్ టోల్ ఫ్రీ నెంబర్ 1908కు సంప్రదించాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 'యాంటీ డ్రగ్ సోల్జర్' సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభించిన సీపీ..యాంటీ డ్రగ్స్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డ్రాయింగ్, వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, బోధన్ ఎస్‌హెచ్‌వో వెంకటనారాయణ, బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు, రూరల్ ఎస్సై రాజశేఖర్, విద్యా వికాస్ జూనియర్ కాలేజీ కరస్పాండెంట్ శ్రీనివాస్, ట్రస్మా ఛైర్మన్ హరికృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి..




**భీమ్‌గల్, అక్షరటుడే:** పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. బుధవారం భీమ్‌గల్ మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి, మున్సిపల్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు రమేష్‌బాబు మాట్లాడుతూ.. పట్టణాల విస్తీర్ణం, జనాభా పెరుగుతున్నప్పటికీ దానికి అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచడం లేదని మండిపడ్డారు. దీనివల్ల ప్రస్తుత కార్మికులపై పని భారం విపరీతంగా పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని.. కేటగిరీల వారీగా రాష్ట్రవ్యాప్తంగా వేతనాలు పెంచాలన్నారు. మున్సిపల్ కార్మికులకు దుస్తులు, చెప్పులు, సబ్బులు, నూనెలు, గుర్తింపు కార్డులు వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.





## కట్టెలు అమ్మితేనే బతుకు బండి నడిచేది..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని పథకాలు అమలు చేస్తున్నా పేదలకు పూర్తిస్థాయిలో అందట్లేదనడానికి నిదర్శనం ఈ చిత్రాలు.. బతికాలంటే కట్టెలు అమ్మాల్సిన స్థితిలో ఓ పేద కుటుంబం చిన్నారులతో సహా కష్టపడుతోంది. ఇలా రోజూ కట్టెలమ్ముతు బతుకీడుస్తోంది. నగరంలో బుధవారం జీజీ కళాశాల సమీపంలో ఈ దృశ్యాలు కనిపించాయి. – అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నిజామాబాద్



## డిచ్‌పల్లి ఎంపీడీవోగా ఉదయ్‌భాస్కర్

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** డిచ్‌పల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా సాతు ఉదయ భాస్కర్ బాధ్యతలు చేపట్టారు. వరంగల్ జిల్లా పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ ప్రమోషన్‌పై డిచ్‌పల్లి ఎంపీడీవో బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు నూతన ఎంపీడీవోకు శుభాకాంక్షలు తెలిపారు.



## తిమ్మారెడ్డిలో 'సర్'పై అవగాహన సదస్సు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని తిమ్మారెడ్డి, ఎల్లారెడ్డి పదోవార్డులో 'సర్'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ గంగారెడ్డి, కౌన్సిలర్లు భాగ్యమ్మ, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ పాల్గొని ఓటర్లకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25వ తేదీ నుంచి జూలై 24వ తేదీ వరకు ఇంటింటికీ ఎన్యూమరేటర్లు ఫారాలు పంపిణీ చేస్తారన్నారు. అనంతరం ముసాయిదా ఓటర్ల జాబితాను జూలై 31, 2026న ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. ముసాయిదా జాబితాపై ఏవైనా అభ్యంతరాలు లేదా సవరణలు ఉంటే జూలై 31, 2026 నుండి ఆగస్టు 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

## ఎల్లారెడ్డిలో ఉచిత వైద్య సేవలు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని ఈడబ్ల్యూఎస్ మైదానంలో బుధవారం యూనికార్ప్స్ హెల్త్ ఫౌండేషన్,ఇండియా మెడికల్ మిషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈడబ్ల్యూఎస్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులైన శ్రీనివాసాచారి, సిస్టర్ హెప్సిబాచారి ఆధ్వర్యంలో ఈ క్యాంప్ జరిగింది. ఈ క్యాంప్‌ను ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ రావు, ఆర్డీవో ప్రభాకర్ ప్రారంభించారు. గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించిన నిర్వాహకులను అధికారులు అభినందించారు. ఈ మెడికల్ క్యాంప్‌లో ఎల్లారెడ్డి మరియు చుట్టుపక్కల గ్రామాల నుండి 400 నుండి 500కు పైగా ప్రజలు వైద్యసేవలను వినియోగించుకున్నారు. యూనికార్ప్స్ హెల్త్ ఫౌండేషన్ నుండి న్యూరో సర్జన్ సామ్సన్ సుజిత్‌కుమార్, డెంటిస్ట్ శిల్ప, ఇండియా మెడికల్ మిషన్ నుండి



అభిషేక్ తదితరులు వైద్యపరీక్షలు నిర్వహించారు.

## చెరువులో పడి వివాహిత మృతి

**అక్షరటుడే, నందిపేట్:** ఇంట్లో పూజ చేసిన పూలను చెరువులో నిమజ్జనం చేసేందుకు వెళ్లిన మహిళ ప్రమాదవశాత్తు మృతి చెందింది. ఈ ఘటన నందిపేట్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. నందిపేట ఎస్సై వినయ్ తెలిపిన వివరాల ప్రకారం నందిపేట్‌కు చెందిన పిసుక సుజాత (50) వృత్తి బీడీ చుడుతుండేది. బుధవారం ఉదయం ఇంట్లో పూజ చేసిన పూలను నిమజ్జనం చేయడానికి రఘునాథ చెరువుకు వెళ్లి తిరిగి రాలేదు. భర్త గంగాధర్ ఇంటికి వచ్చి చూస్తే సుజాత కనిపించలేదు. ఆమె కోసం వెతకగా.. చెరువులో ఆమె మృతదేహం లభ్యమైనది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## 45వ డివిజన్‌లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్..

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని 45వ డివిజన్‌లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. బీజేపీ కార్పొరేటర్ బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిపారు. పారిశుధ్య కార్మికులతో డివిజన్‌లోని యెండల టవర్స్ వద్ద డ్రెయినేజీని శుభ్రపర్చారు. అలాగే శ్రీ చైతన్య స్కూల్ వద్ద తాగునీటి పైప్‌లైన్ లీకేజీని క్లియర్ చేశారు.




## సీసీ కెమెరాల స్తంభానికి రిపేర్లు..

నగరంలోని ప్రధాన కూడలి అయిన పూలాంగ్ వద్ద కొన్నిరోజుల క్రితం సీసీ కెమెరాలు ఉన్న స్తంభం కూలిపోయింది. దీంతో 'సీసీ కెమెరాలంటే అంత నిర్లక్ష్యమా..?' శీర్షికతో పత్రికలో కథనం ప్రచురించగా.. అధికారులు స్పందించారు. బుధవారం స్తంభానికి సిబ్బందితో రిపేర్లు చేయించారు.

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నిజామాబాద్

## యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలి

**అక్షరటుడే, తాడ్వాయి:** యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేసి, రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంచాలని తెలంగాణ రక్షణ సమితి మండల అధ్యక్షుడు గరిడే భుజంగరావు డిమాండ్ చేశారు. బుధవారం తాడ్వాయి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. యూరియా యాప్ వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తెలంగాణలో చాలామంది రైతులు నిరక్షరాస్యులుగా ఉండటంతో పాటు స్మార్ట్‌ఫోన్లు లేకపోవడం, సరైన నెట్‌వర్క్ అందుబాటులో లేకపోవడంతో యూరియా బుక్ చేసుకోలేకపోతున్నారని తెలిపారు. దీంతో వెంటనే యాప్‌ను తొలగించి, పాత విధానంలోనే యూరియా పంపిణీ చేయాలని కోరారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో రైతులు ఐదు రకాల పంటలు సాగు చేస్తుండటంతో యూరియాకు డిమాండ్ భారీగా పెరిగిందని, అధికారులు



దీనిని గుర్తించి సరిపడా నిల్వలు అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతుల పక్షాన టీఆర్ఎస్ పార్టీ పోరాడుతుందని, రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని భుజంగరావు ధీమా వ్యక్తం చేశారు. కవితమ్మ నాయకత్వంలో టీఆర్ఎస్ పార్టీ అన్ని రంగాల్లో పటిష్టంగా ఎదిగిందన్నారు.

## యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు.. జాతీయ రహదారిపై రాస్తారోకో

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** రైతులకు యూరియా తిప్పలు తప్పట్లేదు.. నాగిరెడ్డిపేట్ మండలం ధర్మారెడ్డి గ్రామ రైతులు బుధవారం యూరియా కోసం జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. యూరియా సరిగా అందకపోవడంతో ఆగ్రహించిన రైతులు గ్రామ ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ..యూరియా యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతులపై చిన్నచూపు చూస్తూ పంటలు పండించకుండా చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మా దగ్గర చిన్న ఫోన్లు ఉన్నాయి. యూరియా ఎలా బుక్ చేయాలని ఆందోళన చెందుతున్నాం' అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే యాప్ తీసేసి రైతులకు యూరియా అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఇంకా భారీ ఎత్తున నిరసన కార్యక్రమం చేస్తామని హెచ్చరించారు. యూరియా వచ్చింది అని యాప్‌లు చూసేలోపే క్షణాల్లో అయిపోతోందని.. ఇదెలా సాధ్యమని రైతులు వాపోయారు. రైతులంతా ఆండ్రాయిడ్ ఫోన్లు వాడరని, గ్రామాల్లో నెట్‌వర్క్ సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. యూరియా అనేది రైతుకు ప్రాణాధారం లాంటిదని, యాప్ పద్ధతి వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన



వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పాత పద్ధతిలోనే యూరియా పంపిణీ చేయాలని కోరారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి రైతులను సముదాయించి యూరియా అందేలా చర్యలు తీసుకుంటామని తెలపడంతో రాస్తారోకో విరమించారు.

## అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు

**అక్షరటుడే, కామారెడ్డి :** జిల్లాలో అర్హత ఉన్న జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందజేస్తామని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ హామీ ఇచ్చారు. డీపీఆర్వో నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ టీయుడబ్ల్యూజే(ఐజేయూ) ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన ధర్నా నేపథ్యంలో కలెక్టర్ యూనియన్ నాయకులతో ప్రత్యేకంగా సమావేశమై చర్చలు జరిపారు. సమావేశంలో జర్నలిస్టులు తమ సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో 273 కార్డులకు ఆమోదం లభించినా కొన్ని మాత్రమే పంపిణీ చేశారని, మిగతా వాటికి డీపీఆర్వో అనవసర కొర్రీలు పెడుతున్నారని తెలిపారు. బస్ పాసుల విషయంలోనూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. సదరు అధికారిని వెంటనే బదిలీ చేయాలని లేదా శాఖకు సరెండర్ చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్, అక్రిడిటేషన్ కార్డుల విషయంలో జర్నలిస్టులు ఆందోళన చెందవద్దని, అర్హులందరికీ కార్డులు అందుతాయని భరోసా ఇచ్చారు. డీపీఆర్వో వైఖరిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ ప్రక్రియను పర్యవేక్షించి త్వరితగతిన కార్డులు జారీ చేసే బాధ్యతను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వి. గిరికి అప్పగించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు వి. రజనీకాంత్, కార్యదర్శి తోట రాజేష్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు పట్నం శ్రీనివాస్, కార్యదర్శి సుధాకర్ గౌడ్, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, ఈసీ సభ్యులు పాల్గొన్నారు.




## గుండెపోటుతో బీజేపీ సీనియర్ నాయకుడు మృతి

**అక్షరటుడే, లింగంపేట:** మండల కేంద్రంలో విషాదం నెలకొంది. బీజేపీ సీనియర్ నాయకుడు ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మహారాజుల మురళి గుండెపోటుతో మృతి చెందారు. లింగంపేట మండల కేంద్రానికి చెందిన మహారాజుల మురళి హిందుత్వవాది అని ఆర్ఎస్ఎస్ స్వయంసేవకుడని స్థానిక బీజేపీ నాయకులు పేర్కొన్నారు. రామ్ మందిర్ కరసేవకుడిగా సేవలందించారన్నారు. అనేక పోరాటాలు, హిందుత్వం కోసం కృషిచేసిన గొప్ప నాయకుడని ఆయన మృతి పట్ల లింగంపేట ప్రజలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో తీవ్రగా కృషి చేశాడన్నారు.



## అర్ధరాత్రి వృద్ధురాలికి ఆసరాగా పోలీసులు

**అక్షరటుడే, కామారెడ్డి:** అర్ధరాత్రి చీకటిలో, దారితప్పిన ఓ తల్లి ఆర్తనాదం డయల్ 100 ద్వారా సదాశివనగర్ పోలీసులకు చేరింది. వెంటనే స్పందించిన వారు ఆమెకు సపర్యలు చేసి గమ్యస్థానానికి చేర్చారు. మండలంలోని ధర్మారావుపేట గ్రామ వీధుల్లో మతిస్థిమితం సరిగా లేని సుమారు 60 ఏళ్ల వృద్ధురాలు అయోమయంగా తిరుగుతున్నదన్న సమాచారం పోలీసులకు అందింది. నైట్ పెట్రోలింగ్ విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లు ఇసాక్, రంజిత్ రెడ్డి ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయలేదు. ఇది కేవలం ఒక ఫిర్యాదు కాకుండా.. ఓ తల్లి ఆపదలో ఉందని గ్రహించిన వారు వెంటనే అప్రమత్తమయ్యారు. అక్కడికి చేరుకుని గాలించగా, ముఖంపై గాయాలతో, భయంతో వణికిపోతూ కనిపించింది ఆ తల్లి. ఆమెను సదాశివనగర్ గ్రామానికి చెందిన కుర్ర సావిత్రిగా పోలీసులు గుర్తించారు. గాయాలతో ఉన్న వృద్ధురాలిని వెంటనే దగ్గరకు తీసుకుని, ఓదార్చి.. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. స్వయంగా దగ్గరుండి చికిత్స చేయించి, ఆమెకు ధైర్యం చెప్పారు. బాధ్యత అక్కడితో తీరిపోలేదని భావించిన ఆ పోలీసులు, సావిత్రి బంధువుల ఆచూకీ కోసం ఆరా తీశారు. ఎట్టకేలకు వారిని సంప్రదించి, పూర్తి వివరాలు చెప్పి, ఆమెను సురక్షితంగా వారి చెంతకు చేర్చారు. అర్ధరాత్రి వేళ, గాయాలతో, మాట సాయం చేసే దిక్కులేక ఒంటరిగా మిగిలిన ఆ వృద్ధురాలికి పోలీసులే కొడుకులై నిలిచారు.

